

మెట్ట నేలపై డ్రాగన్‌ఫ్రూట్ సాగు
● తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం..
ఆదర్శంగా నిలుస్తున్న కానిస్టేబుల్ 7

టెన్‌షన్ వద్దు

సమాధానాలు సులువుగా రాసేలా క్యూఆర్ కోడ్ బుక్‌లెట్

● సన్నని లైన్లతో 24 పేజీలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు సమాధానాలను రాసేందుకు టెన్షన్ పడాల్సిన పని లేదు. ఈ సంవత్సరం నుంచి క్యూఆర్ కోడ్‌తో ప్రత్యేకంగా ముద్రించిన 24 పేజీలతో సన్నని లైన్‌లతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. ఇందులోనే సులువుగా సమాధానాలు రాయొచ్చని విద్యా శాఖ తెలిపింది. గతంలో వైట్ పేపర్లు ఇవ్వడం వలన కొంత మంది సమాధానాలు రాయటంలో గందరగోళం నెలకొనేది. క్రాస్‌గా రాసేవారు. అంతే కాకుండా అడిషనల్ పేపర్స్ టై చేసేటప్పుడు ఆర్డర్ ప్రకారం లేకుండా దారం కట్టేవాళ్లు. కొన్ని సందర్భాల్లో పేపర్ కరెక్షన్ చేసేటప్పుడు పేపర్‌లు మిస్ అవ్వడం వలన మార్కులు తగ్గిన సందర్భాలున్నాయని అధికారులు తెలిపారు. ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు సన్నని లైన్లతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నామని, అందులోనే విద్యార్థులు సమాధానాలు రాయాలని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.





పరీక్షల్లో వాడే క్యూర్ కోడ్ కల్గిన బుక్‌లెట్

గతంలో ఫిజికల్ సైన్స్, బయోలజీ పేపర్లను అరగంట గ్యాప్‌తో ఒకేరోజు నిర్వహించేవారని, కానీ ఈ సంవత్సరం వేర్వేరు రోజుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలకు మాత్రం గంటన్నర వ్యవధిలో 12 పేజీల బుక్‌లెట్‌లో పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఈ రెండు పేపర్లలో ఒక్కోటి 40 మార్కులు ఉంటాయి. మొత్తం అన్ని పేపర్లు 80 మార్కులకు రాయాల్సి ఉంటుంది. మరో 20 మార్కులు ఇంటర్నల్స్ నుంచి తీసుకుంటారు. ఈ సంవత్సరం గ్రేడింగ్ కాకుండా మార్కుల విధానం ఉంటుందంటున్నారు అధికారులు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పభుత్వ పరీక్షల సహాయ నిర్వాహణాధికారి లక్ష్మయ్య, సిద్దిపేట రూరల్ ఎంఈవో రాజిరెడ్డితో కలిసి డీఈవో మాట్లాడారు. 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో 79 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 14,138మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో 1763 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. 79 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్మెంట్ ఆఫీసర్లను, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. 20 మందికి ఒక ఇన్విజిలేటర్ ఉంటారని తెలిపారు. కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. విద్యార్థులు అరగంట ముందే విద్యార్థులు సెంటర్‌కు చేరుకోవాలని డీఈవో సూచించారు.

భట్టి బడ్జెట్‌పై బోలెడు ఆశలు



- నిధుల కోసం మెతుకుసీమ ఎదురుచూపు
- సాగునీటి కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి
- భూనిర్వాసితుల పరిహారం,
- రిజర్వాయర్ల కాలువలకు సొమ్ము అవసరం
- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు దక్కేనా
- అధ్వాన రహదారులకు మోక్షం లభించేనా?



అసంపూర్తిగా పంట కాలువ పనులు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి18 : ఓ వైపు మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ల కాలువల నిర్మాణం.. భూనిర్వాసితులకు పరిహారం.. మరోవైపు రూ.4లక్షల ఎకరాలకు నీరందించే సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల నత్తనడక.. ఇంకోవైపు విద్య, వైద్య రంగాల్లో అనిశ్చితి, మరమ్మతులకు గురైన రహదారులు, పెండింగ్‌లో కొత్త రోడ్లు.. అదే విధంగా చేర్యాల, దుబ్బాక, రామాయంపేట, పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటులో జాప్యం.. వీటితోపాటు పంపిణీకి నోచక శిథిలావస్థకు చేరుతున్న డబుల్ బెడ్రూం ఇళ్లు.. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సందిగ్ధత.. మెతుకుసీమ దశ, దిశ మార్చేలా కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూపు... ఇవన్నీ ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వేధిస్తున్న సమస్యలు. వీటన్నింటిని అధిగమించాలంటే సరిపడా నిధులు అవసరం. ఆ నిధుల కేటాయింపుతోనే ఈ ప్రాంత భవిష్యత్తు ఆధారపడి ఉంది. నేడు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై మెతుకుసీమ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

సాగునీటి వనరులకు మోక్షం కలిగేనా

వేసవి మొదట్లోనే సాగునీటి కోసం ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పొట్ట దశకు వచ్చిన వరిపొలాలను రక్షించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి నిత్యం కనిపిస్తోంది. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ప్రస్తుతం గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ల నుంచి చెరువులు, ఆయకట్టు భూముల దాకా కాలువలను నిర్మించాల్సి ఉంది. తద్వారా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలకు నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటివరకు కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయడం లేదు. అదే విధంగా మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఇంకా పూర్తి పరిహారం అందలేదు. నిర్వాసిత కాలనీల్లోనూ తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయి. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు చేపట్టిన కాలువ పనులను నిలిపివేశారు. వీటికితోడు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు సాగునీటిని అందించడానికి చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను గాడిన పెట్టాల్సిన

మిగతా 7వ పేజీలో



చివరికి ఇలా..

ఇటు బోరుబావులు ఎండిపోయి.. అటు కాల్వల ద్వారా సాగునీరు అందక చి'వరి'కి తిప్పలు తప్పడం లేదు. ఎదిగిన పంట కళ్లముందే ఎండిపోతుంటే రైతులు ఎలాగైన కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొండపాక మండల పరిధి తిమ్మారెడ్డిపల్లిలో ఓ రైతు రెండెకరాలలో సాగు చేసిన వరికి నీరందక ఎండుముఖం పట్టగా, ట్యాంకర్ ద్వారా నీరందించి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తిమ్మారెడ్డిపల్లి పక్క నుంచే తపాస్‌పల్లి కాలువ ఉన్నప్పటికీ ఈ దుస్థితి తప్పడం లేదు.

- కొండపాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి)

రంజాన్ వేళలు


ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:59 (గురువారం ఉదయం)



తీగపై కనువిందు

ఆహార వేటకు వచ్చి పచ్చటి పంటల మధ్య విద్యుత్ స్తంభం తీగలపై కోసం వరుసగా వాలిన ఈ పక్షుల దృశ్యం కొండపాక మండలం బందారంలో కనువిందు చేసింది.

- కొండపాక, మార్చి 18(ఆంధ్రజ్యోతి)



తొమ్మిదో వారం బుకింగ్ ఆదాయం రూ.68.46లక్షలు

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 9వ వారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి ఆర్జితసేవలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.14,28,446, ఆదివారం రూ.48,13,753, సోమవారం రూ.6,04,388 చొప్పున రూ.68,46,587 మేర ఆదాయం సమకూరింది.

పొలాల వెంట చిరుత సంచారం

భయాందోళనలో తిమ్మక్కపల్లి గ్రామస్థులు

రాయపోల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలో మళ్లీ చిరుత పులి సంచారం కలకలం రేపింది. కొంత కాలం క్రితం వడ్డెపల్లి అటవీ ప్రాంతంలో సంచరించగా తాజాగా తిమ్మక్కపల్లికి చెందిన గల్వాన్ చెరువు పక్కన పొలాల వద్ద చిరుత సంచరిస్తూ రైతులకు కనిపించింది. ఓ వ్యక్తి పులి సంచారానికి సంబంధించిన వీడియో తీయగా, సోషల్‌మీడియాలో స్థానికంగా చక్కర్లు కొడుతున్నది. దీంతో తిమ్మక్కపల్లితో పాటు సమీప గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులను ఆరా తీయగా చిరుత సంచారం విషయం నిజమే అని తెలిసింది. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హైమద్ హుస్సేన్‌ను సంప్రదించగా తమకు సమాచారం అందిందని, వెంటనే వెళ్లి పరిశీలిస్తామని పేర్కొన్నారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో హైమద్ హుస్సేన్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.



తిమ్మక్కపల్లి సమీపంలో చిరుత

'యువ వికాసం' ఎలా?

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు
- ఆన్‌లైన్‌లో పథకానికి దరఖాస్తులు
- ఇంకా వెబ్‌సైట్‌లో లేని వివరాలు
- సమాచారం తెలియక నిరుత్సాహానికి గురైన ఆశావహులు

సిద్దిపేట టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకం కింద సబ్సిడీ రుణాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దీంతో నిరుద్యోగ యువత అర్హత పత్రాలతో ఇంటర్‌నెట్ సెంటర్లకు పరుగులు తీయగా, నిరాశే మిగిలింది. దరఖాస్తులు అందుబాటులోకి వచ్చినప్పటికీ సరైన విధివిధానాలు, సబ్సిడీ వివరాలు వెబ్‌సైట్‌లో లేవు. నోటిఫికేషన్, నియమ నిబంధనలకు సంబంధించిన ఎలాంటి జీవో కనిపించపోవడంతో యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుకు గడువు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్లు)కి చెందిన నిరుద్యోగ యువతకు రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాన్ని అందించే రాజీవ్ యువ వికాసం పథకానికి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పథకంలో భాగంగా తెలంగాణ బెనిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ వెబ్‌సైట్‌లో పదుల సంఖ్యలో వివిధ యూనిట్ల పేరుతో పథకానికి సంబంధించి అర్హత ఆధారంగా ఏయే యూనిట్‌కు ఎంత రుణం అందించాలో ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేసుకున్న తర్వాతా దరఖాస్తు నమోదు ప్రక్రియలో తెలుస్తున్నది. ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నది. దరఖాస్తుల నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్న తరువాత ఏప్రిల్ 6 నుంచి మే 31వరకు ఆయా అభివృద్ధి శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్2 న ఎంపికైన లబ్ధిదారుల వివరాలను ప్రకటించి, అదే రోజున పలువురు లబ్ధిదారులకు రుణ మంజూరు ప్రతాలను అందించేలా ప్రభుత్వం రూపకల్పన చేసింది.



సిద్దిపేటలోని ఇంటర్‌నెట్ కేంద్రంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ఆశావాహులు

విధివిధానాలేవి?

ఇంతవరకు బాగానే ఉన్నా రుణాలకు సంబంధించి సబ్సిడీ ఏయే యూనిట్‌కు ఎంత వస్తుంది, పలు కులాలకు చెందిన వారికి ఎన్ని యూనిట్లు ఉన్నాయి, అర్హత ఏమిటి, వయసు పరిమితి, సడలింపు తదితర వాటి నిబంధనలు, వివరాలను తెలిపేలా వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. పథకం గురించి ఏ అధికారిని అడిగినా సరైనా గైడ్‌లైన్స్ తమకు అధికారికంగా రాలేదని బహిరంగంగానే చెబుతున్నారు. మంగళవారం రాత్రి వరకు కూడా పథకానికి సంబంధించిన జీవో, ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడం విచిత్రం. వెంటనే విధివిధానాలు తెలపాలని యువతీయువకులు కోరుతున్నారు.

గజ్వేల్ ఎంసీహెచ్‌కు మోక్షమేదీ?

ఏడాదిన్నరైనా ఓపీ సేవలకే పరిమితం

గజ్వేల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంపై కోపమో... పట్టింపులేనితనమో తెలియదు కానీ ప్రజలకు మాత్రం ప్రభుత్వ తీరుతో కష్టాలు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్ పట్టణంలో రూ.27.35 వ్యయంతో నిర్మించిన మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి(ఎంసీహెచ్) అన్ని హంగులతో సిద్ధం చేసి ప్రారంభించారు. కానీ, ఓపీ సేవలు మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆసుపత్రిని ప్రారంభించి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రసూతీ సేవలకు మాత్రం వినియోగించడం లేదు. నూతన భవనంలో ఓటీ, లేబర్ రూమ్‌లో కావాల్సిన పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తుంది.



హైరిస్క్(ప్రసూతి) కేంద్రం ప్రస్తుతం గజ్వేల్ ఆసుపత్రిలోనే కొనసాగుతుండగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల వైద్యానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ నెల దాదాపుగా 350 డెలీవరీలు జరుగుతుండగా, రోజూ దాదాపుగా వంద మందికి పైగా గర్భిణులు వైద్య సేవల నిమిత్తం వస్తుంటారు. దీంతో ఆసుపత్రి ఇరుకుగా మారింది. నూతన భవనంలోకి ఆసుపత్రిని మారిస్తే ఇబ్బందులు తొలిగే అవకాశాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వమైనా భేషజాలు లేకుండా ప్రజల కోసం పనిచేయాలని వెంటనే ఎంసీహెచ్ భవనాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లు పెరిగేలా చూడాలి

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీ గురుకులాల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చూడాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం ఆయన సిద్దిపేటలోని గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. మైనారిటీలకు 75శాతం సీట్లు, ఇతరులకు 25 శాతం సీట్లు కేటాయించటంతో గురుకుల విద్యాలయంలో 287 మంది మాత్రమే విద్యార్థులున్నారని ప్రిన్సిపాల్ భానుప్రకాష్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర గురుకులాల్లో సీట్లు దొరక్క చాలా మంది విద్యార్థులు వేచిఉన్నారన్నారు. ఈ అకడమిక్ ముగియగానే మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలందరితో సమావేశం నిర్వహించి మైనారిటీ గురుకులాల్లో పిల్లలను చేర్పించేలాగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ ఆల్ ద బెస్ట్ తెలిపారు. కఠిన సబ్జెక్టును ఎక్కువసార్లు చదవాలని, ప్రతీ ఒక్కరు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించి కుటుంబానికి, విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డార్మెంటరీ గదిలో ఫ్యాన్ల ఏర్పాటు, స్పోర్ట్స్ మెటీరియల్ ఇతరత్రా అన్ని సౌకర్యాలు కల్పిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నమే కాకుండా కూరను సైతం మొత్తం తినాలని విద్యార్థులకు సూచించారు.





వాహనాల వేలం

నారాయణఖేడ్: వివిధ కేసుల్లో సీజ్ అయిన రెండు బైకులను 20న గురువారం ఉదయం 11 గంటలకు ఖేడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇసుక టిప్పర్లు సీజ్, ఆరుగురి అరెస్ట్

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఏడు టిప్పర్లను, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట నక్కవాగు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను, కోకాపేట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను కంది, హనుమాన్‌నగర్‌లలో మంగళవారం పట్టుకున్నామని తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

















బావిలో పడి వ్యక్తి మృతి


జంగం సందీప్ మృతదేహం

సిద్దిపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామానికి చెందిన జంగం సందీప్(23) రెండురోజుల కింద మాచాపూర్‌లో బంధువుల ఇంటి గృహ ప్రవేశానికి వచ్చాడు. ఈ క్రమంలో కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. గజ ఈతగాళ్లతో బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

రాయపోల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ కృష్ణం రాజు వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన గూని ఎల్లం(40) కొంతకాలంగా మద్యానికి అలవాటుపడ్డాడు. రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం అందరూ అన్నం తిని పడుకున్నారు. దీంతో ఎల్లం వారి పొలం వద్దకెళ్లి చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. గమనించిన సమీప బంధువులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. భార్య పిల్లలు అక్కడికి వెళ్లి చూడగా ఎల్లం చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు.

నిజాంపేటలో ఒకరు...

నిజాంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గగరుగుల రాజు, లలిత దంపతుల కుమారుడు గరుగుల భాను(17) పదో తరగతి పూర్తయిన తర్వాత గ్రామంలో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన తల్లిదండ్రులు ఊరెళ్లిన సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటి పక్కన యువకుడు బయటకు వెళ్లడానికి భానును పిలవగా సమాధానం రాలేదు. దీంతో ఇంట్లోకి తొంగి చూసేసరికి వేలాడుతు కనిపించాడు. వెంటనే తలుపులు పగులగొట్టి.. 108 అంబులెన్స్‌కు సమాచారమందిచ్చారు. దుబ్బాకలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని మృతిచెందినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


చేగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట మండలం పరిధిలోని పులిమామిడి గ్రామానికి చెందిన పెండాల సునీల్(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన ఇంటి నిర్మాణానికి తెచ్చిన పెయింటింగ్ సామాన్లు మిగిలిపోవడంతో ఇచ్చేందుకు 12న సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి మిత్రుడితో బైక్‌పై వెళ్లాడు. బోనాల గ్రామ శివారులో రాంగ్‌రూట్‌లో వసుతన్న ఎక్సెల్ ఢీకొనడంతో సునీల్ కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 16న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, ఐదునెలల పాప ఉన్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మంజీరాలో యువకుడి మృతదేహం లభ్యం

సంగారెడ్డి క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మంజీరా డ్యామ్‌లో ఈత కోసం వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం రెండురోజుల తర్వాత లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన అందోల్‌కు చెందిన ఎం.నరేష్(30), దుర్గ భార్యాభర్తలు. నరేష్ డ్రైవర్ పనిచేస్తూ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో అద్దెకుంటున్నాడు. కాగా 16న నలుగురు స్నేహితులతో కలిసి సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులోని మంజీరా డ్యామ్‌లో ఈతకోసం వెళ్లారు. దీంతో నరేష్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహం కోసం ఆదివారం రాత్రి, సోమవారం డ్యామ్‌లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పోలీసులు డ్యామ్‌లో గాలించగా నరేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

మెదక్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తల్లీకూతురు అదృశమైన సంఘటన మెదక్ పట్టణంలోని బ్రాహ్మణవీధిలో చోటు చేసుకుంది. బ్రాహ్మణవీధికి చెందిన సత్యనారాయణ, విజయలక్ష్మి భార్యాభర్తలు. సోమవారం విజయలక్ష్మి తన కూతురుతో కలిసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చిన సత్యనారాయణకు ఇద్దరూ కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా కనిపించినచో 8712657878, 8712657913 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు సూచించారు.





పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనూచౌదరి, తదితరులు

'ఫైనాన్షియల్ లిటరసీ' ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్. గోపాల సుదర్శనం రచించిన ఫైనాన్సియల్ లిటరసీ (ఆర్థిక అక్షరాస్యత) పుస్తకాన్ని కలెక్టర్ మనూచౌదరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆర్థిక అక్షరాస్యత అవసరమన్నారు. నేటి మార్కెట్ కేంద్రీకృత ఆధునిక ప్రపంచములో వ్యక్తుల, సంస్థల, వివిధ విభాగాల ఆదాయ వనరులు సమకూరే దారులు, పద్ధతులు పెరుగుతున్నప్పటికీ, అవసరాలను తీర్చుకునే అంశాలలో ఆర్థిక పరిజ్ఞాన లేమితో వెనుకబడుతున్నారన్నారు. రోజువారీ కనీస అవసరాలను తీర్చుకోలేక తడబడుతూ అప్పులఊబిలో కూరుకుపోతున్నారని, అందుకు ప్రధాన కారణం వారిలో ఆర్థిక అక్షరాస్యత లోపించడమేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సునిత, పుస్తక రచయిత డాక్టరు గోపాల సుదర్శనం, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు అయోధరెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పయినీరింగ్ మైండ్ సత్యనారాయణ

టాప్‌టెన్ జాబితాలో చోటు



తూప్రాన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పయినీరింగ్ మైండ్స్ ఆఫ్ ఇండియా-2025 జాబితాలో మెదక్ జిల్లా తూప్రాన్ ఎంఈవో, హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం డాక్టర్ పార్వతి సత్యనారాయణకు చోటు లభించింది. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్న ఆయన 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. క్రైట్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ సంకలనం చేసిన ఈ జాబితాలో ఆయన చోటు సంపాదించారు. బోధన, అభ్యాస ప్రక్రియలను మార్చడంలో ఆయన చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కింది. ఉపాధ్యాయ సంఘ నేతగా, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర నేతగా సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. దేశంలోనే టాప్ టెన్ జాబితాలో చోటు సంపాదించిన ఆయనను మండలంలోని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు అభినందిస్తున్నారు.

క్వ్యూస్ట్ టాలెంట్ సెర్చ్‌లో ప్రతిభ



చైత్ర, సతీష్

వర్గల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన క్వ్యూస్ట్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో మండలంలోని నెంటూర్ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీహర్ష టాలెంట్ స్కూల్‌కు చెందిన 6వ తరగతి చదువుతున్న డి. చైత్ర రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, 5వ తరగతి చదువుతున్న ఎల్. సతీష్ జోనల్ లెవల్‌లో మొదటి ర్యాంకు సాధించారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టీచర్లు అభినందించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో..



రికార్డుతో ధృవకర్‌రెడ్డి

కొడిపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పిట్ట కొంచెం కూత ఘనం అన్నచందంగా మూడున్నరేళ్ల చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. మండల కేంద్రంలోని పీర్యా తాండలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి కుమారుడు మూడున్నర సంవత్సరాల ధృవకర్‌రెడ్డి 46 సెకండ్‌లలో 28 రాష్ట్రాల పేర్లు, రాజధానులు వివరాలను చెప్పడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ఆఫ్ 2025 సర్టిఫికెట్‌ను అందజేశారు. ఫిబ్రవరి 7న ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష నిర్వహించి, పేరు నమోదు చేశారు.



గ్రామపంచాయతీల పనితీరు అడిగి తెలుసుకుంటున్న బృందం

కొండాపూర్‌లో రాజస్థాన్ బృందం పర్యటన

కొండాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వహణ, ఉపాధి హామీ పనుల తీరును రాజస్థాన్ ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. 21 మంది సభ్యులున్న బృందం మంగళవారం మండలంలోని తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామ పంచాయతీను సందర్శించింది. గ్రామ పంచాయతీలు ఎలా పని చేస్తున్నాయో బృందంలోని అధికారులు ప్రజలు, అధకారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఉపాధి హామీలో కూలీల పనిదినాలు, చెల్లింపులు, చేపట్టిన పనులు వంటి అంశాలు తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో రాజస్థాన్ టీం అసోసియేట్ మురారీ శర్మ, జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరప్ప, పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పంటలకు నీరందించండి: బీఆర్ఎస్

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను వెంటనే నింపి, కాలువల ద్వారా పంటలకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. చేర్యాల-కొమురవెల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం తపాస్‌పల్లి రిజర్వాయర్ ఎండిపోయిందని, తద్వారా భూగర్భజలాలు పడిపోయి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే రిజర్వాయర్‌ను నింపి పంటలు కాపాడుకునేందుకు కాలువల ద్వారా విడుదల చేయాలని, ఎండిపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. వెంటనే నీటిని విడుదల చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, బీఆర్ఎస్ నాయకులు కొండా శ్రీధర్, భీమనపల్లి కరుణాకర్, మేరుగు కృష్ణ, కాయిత రాజేందర్‌రెడ్డి, పూడెం గోపాల్‌రెడ్డి, తలారి కిషన్, పులిందార్రెడ్డి, పచ్చిమడ్ల స్వామి, ముత్యం నర్సింహులు, భరత్, బొడ్డం వంశీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట నేలపై డ్రాగన్‌ఫ్రూట్ సాగు



డ్రాగన్‌ఫ్రూట్స్ ను చూపిస్తున్న బానోతు దుదియా నాయక్

తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం.. ఆదర్శంగా నిలుస్తున్న కానిస్టేబుల్



అక్కన్నపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అతనో కానిస్టేబుల్.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే వ్యవసాయంపై ప్రేమతో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నాడు. అందరి కంటే భిన్నంగా కొత్తపంట సాగు చేయాలనే ఉద్దేశంతో డ్రాగన్ ఫ్రూట్‌ను తన భూముల్లో పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మెట్టప్రాంతమైన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పంతులుతండాకు చెందిన బానోతు దూదియనాయక్ హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారసత్వంగా తనకు వచ్చిన భూమిలో ఏటా సంప్రదాయ పంటలైన పత్తి, మొక్కజొన్న, వరి, సాగు చేశాడు. అవి దిగుబడి సరిగా రాలేదు. మిత్రుడి సూచన మేరకు మంచి దిగుబడి నిచ్చే పంట వేయడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదిగా భావించి, ఒకసారి వేస్తే దాదాపు 30 సంవత్సరాలకు పైగా ఉండే డ్రాగన్ ఫ్రూట్స్ పంటను ఎంచుకున్నాడు. 2.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేస్తున్నాడు. ఏడు సంవత్సరాల క్రితం పంట వేయగా పంట వేసిన తర్వాత తొమ్మిది నెలల నుంచి దిగుబడి వస్తోంది. పదిహేను రోజులకొకసారి పంటకు నీటి తడి అందిస్తే సరిపోతుందని, అది వర్షాకాలమైతే అవసరమే లేదని రైతు తెలిపారు. ప్రతి సంవత్సరం 10 నుంచి 18 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని, పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నట్లు బానోతు దూదియానాయక్ తెలిపారు.

పంట సాగు దశలో ఒకసారి ఎకరాకు రూ.4 నుంచి 5 లక్షలు పెట్టుబడి పెడితే 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఎలాంటి పెట్టుబడి లేకుండా ప్రతి సంవత్సరం పంట చేతికి వస్తుంది. పంటలను ఎలాంటి చీడపీడలు ఆశించవని, వన్యప్రాణులు, అడవి జంతువుల వల్ల కూడా ఎలాంటి నష్టం జరగదు. ఇది పూర్తిగా లాభదాయకమైన పంట రైతు పేర్కొంటున్నాడు. ఆరోగ్య రీత్యా అన్ని రకాల విటమిన్లు, పోషక పదార్థాలు ఈ పండులో లభిస్తుండడంతో బయట డ్రాగన్‌ఫ్రూట్స్‌లకు మంచి మార్కెటింగ్ ఉంది. డ్రాగన్‌ఫ్రూట్స్ తోటలో అంతర్ పంటగా మొక్కజొన్నతోపాటు ఇతర పంటలను కూడా వేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు ఈ పంట లాభదాయకంగా ఉంటుందని, తమ పంట క్షేత్రం వద్దనే నర్సరీని కూడా ఏర్పాటు చేసి చుట్టూ పక్కల రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను కూడా అందిస్తున్నారు.

మిత్రుడి సలహాతో సాగు



పత్తి, మొక్కజొన్న, వరి, పంటలను సాగు చేస్తే దిగుబడి సరిగా రాక నష్టం వచ్చేది. మిత్రుడి సలహాతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా పులిపాడుకు వెళ్లి డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు గురించి తెలుసుకున్నా.. అక్కడి నుంచి మొక్కలను తీసుకువచ్చి సాగు చేశాను. ప్రతి సంవత్సరం మంచి దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు డిమాండ్ ఉండడంతో లాభాలు వస్తున్నాయి. పంటకు చీడపీడలు ఆశిస్తాయన్న భయం లేదు. అంతరపంటలు కూడా సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నా.. మార్కెట్ సౌకర్యం కూడా బాగుంది. మెట్ట ప్రాంత రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు మంచిదే. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

- బానోతు దుదియా నాయక్, కానిస్టేబుల్, పంతులు తండా, అక్కన్నపేట

అసలేం జరుగుతోంది..!

ప్యారానగర్‌పై ప్రభుత్వ అడుగులు ఎటు

42 రోజులుగా ఆగని ప్రజల నిరసనలు

గుట్టుగా పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం



ప్యారానగర్ వద్ద పోలీసుల బందోబస్తు

గుమ్మడిదల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మండలంలోని ప్యారానగర్‌లో చేపట్టిన డంపింగ్ యార్డ్ వద్ద అసలేం జరుగుతోంది అంతుపట్టడం లేదు. సిటీలోని చెత్త మొత్తం తెచ్చి తమ మీద పడేస్తే బతకలేమంటూ ఇక్కడి ప్రజలు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా అక్కడ పనులు కొనసాగుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి చెత్తను డంప్ చేయడానికి ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి పరిసర గ్రామాల వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి, పరిసరాలకు దీని వల్ల తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా 42 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకోవడం లేదు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, రాత్రి సమయంలోనే పనులు ప్రారంభించడం కూడా ప్రజల ఆగ్రహానికి కారణమైంది. ప్రజల నిరసనల మధ్య అక్కడ మాత్రం గుట్టుచప్పుడు కాకుండా పనులు సాగుతున్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్యారానగర్ విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటోంది.. అసలు ప్రభుత్వ వైఖరి ఏమిటీ అన్న విషయాలు కూడా ఎవరూ చెప్పకపోవడం.. మరో వైపు అక్కడ పనులు సాగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో మండల ప్రజలు ఆందోళనలు ఉధృతం చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

పనులు ఆగాయా..?

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ విషయంలో హైకోర్టు ఇటీవల మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని స్పష్టం చేసింది. అయితే, ఆదేశాల తర్వాత కూడా రహస్యంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైకోర్టు తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని ఆదేశించినా, నిర్మాణం పూర్తిగా ఆగిందా లేదా అన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. డంపింగ్ యార్డ్ నిర్మాణ స్థలాన్ని కంచెతో చుట్టి బారికేడ్‌లా ఏర్పాటు చేశారు. అక్కడ భారీగా పోలీసులు మోహరించడంతో పోలీస్ పహారా నడుమ అధికారులు పనులు చేస్తున్నారని అనుమానిస్తున్నారు. ప్రజల ఆందోళనకు తలొగ్గి ప్రభుత్వం వెంటనే ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ పనులు ఆపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవాలు చెప్పండి



ప్యారానగర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న దంప్ యార్డ్‌ను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. అయినా.. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. పనులు నిలిపివేయలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన అధికారులు మాత్రం లోలోపల పనులు సాగిస్తున్నారన్నారని ప్రజలు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

- అమ్మగారి సదనంద్ రెడ్డి, జేఏసీ నాయకులు గుమ్మడిదల

ప్రజల ఇబ్బందులు పట్టవా..



ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి పరిసరాలను కాలుష్యంగా మారుస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. సుమారు 42 రోజులుగా ఆందోళన చేస్తున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా ఓట్లు కావాలి కాని, మా బాధలు పట్టించుకోరా.

-చాపల మధు, నల్లవల్లి గ్రామస్థుడు

తక్షణమే ఎత్తి వేయాలి



పచ్చని పొలాలను ఆనుకుని ఉన్న ఆకుపచ్చని అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి, అడవిలో చిచ్చు పెడుతున్నారు. దీని వల్ల ఈ ప్రాంతం మొత్తాన్ని కాలుష్యమయంగా మారుస్తున్నారు. నెల రోజుల నుంచి జనమంతా రోడ్డెక్కి నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలి.

- సత్తమ్మ, నల్లవల్లి గ్రామస్థురాలు

ఇంట్లోకి చొరబడి అడవిపంది హల్‌చల్



రఘుపతిరెడ్డి ఇంట్లోకి చొరబడిన అడవిపంది

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో మంగళవారం రాత్రి ఓ అడవిపంది హల్‌చల్ చేసింది. జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి గుండా అకస్మాత్తుగా జనావాసాలలోకి దూసుకువచ్చింది. చౌరస్తా వద్ద ఉన్న పలువురిని గాయపరుస్తూ గ్రామానికి చెందిన వంగ రఘుపతిరెడ్డి ఇంట్లోకి చొరబడింది. భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు అరుస్తూ బయటకు పరుగులు పెట్టారు. తలుపులు మూసివేయడంతో అడవిపంది బయటకు వెళ్లే మార్గం లేక వస్తువులు ధ్వంసం చేసింది. సుమారు అరగంటపాటు ఇంట్లోనే అడవిపంది వీరంగం వేయగా, స్థానికులంతా ఆ ఇంటి ఆవరణకు చేరుకున్నారు. చివరకు పందిని బయటకు వెళ్లగొట్టే క్రమంలో ఇంటి తలుపు ముందు వలవేసి పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆ అడవి పంది దారితప్పి గ్రామంలోకి వచ్చినట్లు భావిస్తున్నారు.

భట్టి బడ్జెట్‌పై బోలెడు ఆశలు

5వ పేజీ తరువాయి

అవసరం ఉంది. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు రిజర్వాయర్ తలాపునే ఉన్నప్పటికీ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రాజెక్టులను నిర్మిస్తే దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

కొత్త డివిజన్లు, మండలాల్లో సమస్యలు

ఉమ్మడి మెదక్ జిల్లాను విభజించిన తర్వాత కొత్తగా నర్సాపూర్, తూప్రాన్, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, హుస్నాబాద్, గజ్వేల్ రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 20వరకు నూతన మండలాలు ఏర్పాటయ్యాయి. చిన్నగ్రామాలు, తండాలను పంచాయతీలుగా మార్చారు. కాగా హోదాలు పెరిగినప్పటికీ కొత్త డివిజన్లు, మండలాలు, గ్రామపంచాయతీల్లో పరిపాలన పరమైన సమస్యలు ఉన్నాయి. అధికారులను కేటాయించినప్పటికీ సొంత భవనాలు లేకపోయాయి. నిధుల కొరత ఉన్నందునే పరిష్కారం కావడం లేదన్నట్లుగా తెలుస్తోంది. అదే విధంగా సిద్దిపేట జిల్లా చేర్యాల, దుబ్బాక, మెదక్ జిల్లా రామాయంపేట, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మారుస్తామనే హామీలు ఉన్నాయి. వీటి కోసం స్థానికంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'డబుల్' ఇళ్లకు పరిష్కారమేది?

గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. ఇందులో కొన్నింటిని అర్హులకు కేటాయించగా.. చాలా వరకు మిగిలిపోయి ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థ దశకు చేరుతున్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 3 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించి పలుచోట్ల అర్హులను గుర్తించి ముందడుగు వేసింది. డబుల్ ఇళ్లకు కూడా నిధులు కేటాయించి పూర్తిచేయిస్తే 3వేల కుటుంబాలకు నీడ దక్కుతుంది. గత ప్రభుత్వం 80 శాతం పనులను పూర్తి చేయించగా మిగతా పనుల కోసం నిధులు అవసరమయ్యాయి. లేదంటే గతంలో వెచ్చించిన నిధులు కూడా వృథా అవుతాయి.

విద్య, వైద్యం, రోడ్లకు నిధులొచ్చేనా?

గురుకులాలకు సొంత భవనాలు అవసరం ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ చేపట్టిన అభివృద్ధి పనులు సైతం నత్తనడకన నడుస్తున్నాయి. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికరించడానికి నిధుల కొరత కనిపిస్తోంది. అదే విధంగా మెదక్, సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలు, అనుబంధ ఆసుపత్రుల నిర్మాణానికి త్వరితగతీన నిధులు కేటాయించాలి. సిద్దిపేటలో నిలిచిన వెయ్యి పడకల ఆసుపత్రిని ప్రారంభించడానికీ నిధుల సమస్యే చూపిస్తున్నారు. ఇదే సిద్దిపేటలో వెటర్నరీ కళాశాల, నర్సింగ్ కళాశాల భవనాలదీ అంతే సంగతి. ఇదిలాఉంటే ఉమ్మడి మెదక్ జిల్లాల్లో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులను మరమ్మత్తులు చేయించాల్సి ఉంది. కొత్త రహదారుల ప్రతిపాదనలు పెండింగ్‌లో పడ్డాయి. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల ఆధారంగానే విద్య, వైద్యం, రహదారుల ప్రగతి సాకారమవుతుంది.

మడూర్‌లో వెయ్యేళ్ల నాటి శిల్పాల గుర్తింపు



మడూరు శివాలయం వద్ద కొత్త చరిత్ర బృందం సభ్యుడు

చిన్నశంకరంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మడూరు గ్రామంలోని శివాలయం వద్ద వెయ్యేళ్ల నాటి రాతి శిల్పాలను గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు బుర్ర సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం పురాతన ఆలయం వద్ద పడి ఉన్న రాతిశిల్పలను పరిశీలించి, అవి రాష్ట్ర కూట కల్యాణి చాణుక్య రాజుల కాలం నాటివని, కాకతీయుల శైలిలో శిల్పాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణి చాణుక్య రాజుల కాలంలో ఆభరణాలతో చెక్కిన యోగశనమూర్తి విగ్రహం, యోగముద్రలో శేషతల్పంపై ఉన్న విష్ణుమూర్తి, లక్ష్మీదేవి శిల్పాలతో పాటు మరి కొన్ని దేవతామూర్తుల విగ్రహాలను గుర్తించినట్లు వివరించారు. కాకతీయుల్లో చివరి వాడైన రెండు ప్రతాపరుద్రుడు కాలం నాటివని వారు వివరించారు.



పోలీసులకు పట్టుబడిన డీసీఎం వాహనం

బిల్లు లేకుండా పాన్‌మసాలా రవాణా

పట్టుకున్న పోలీసులు.. అప్పటికప్పుడు బిల్లుల సృష్టి

తూప్రాన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సరైన బిల్లులు లేకుండా పాన్ మసాలా ప్యాకెట్లు రవాణా చేస్తున్న వాహనాన్ని తూప్రాన్ పోలీసులు పట్టుకున్నారు. వాహనం పోలీస్‌స్టేషన్‌కు చేరేలోపే బిల్లులు సృష్టించారు. 200 బ్యాగుల్లో సరుకు పట్టుబడగా, కేవలం 50 బ్యాగులకే బిల్లులు ఉండటంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి అక్రమంగా పాన్ మసాలా బ్యాగులు రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై శివానందం తన సిబ్బందితో కలిసి తూప్రాన్ పట్టణ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వేకువజామున తనిఖీలు చేపట్టారు. తనికల్లో కేఏ01 ఏఎఫ్2391 నంబర్ డీసీఎం వాహనంలో ఎలాంటి బిల్లులు లేకుండా పాన్‌మసాలా బ్యాగుల్లో తరలిస్తున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత కొందరు సరుకునకు బిల్లులు సృష్టించారు. 200లకుపైగా బ్యాగ్‌ల్లో పాన్‌మసాలా ఉండగా, కేవలం 50 బ్యాగ్‌లకే బిల్లులు తీసుకువచ్చారు. దాంతో పట్టుకున్న వాహనాన్ని మెదక్ కమర్షియల్ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరణవార్త విని స్పృహ తప్పిన తల్లి



స్పృహ తప్పిన తల్లి యాదమ్మ

జోగిపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. విషయం తెలిసి అతని తల్లి స్పృహ తప్పి అపస్మారకస్థితికి చేరుకుంది. ఈ సంఘటన ఆందోల్ మండలం చింతకుంట శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేట పట్టణానికి చెందిన పెద్దబోయిన సాయికుమార్ (26) చింతకుంట శివారులోని మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వలలు వేసి రాత్రి ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యంలో సాయికుమార్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి ఎస్సై పాండు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహన్ని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి పోస్టుమార్టం కోసం తరలించారు.

కొడుకు మృతితో స్పృహ తప్పిన తల్లి

సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషయం తెలిసిన తల్లి యాదమ్మ స్పృహ తప్పి అపస్మారక స్థితికి చేరుకుంది. గారబంగా పెంచుకున్న కొడుకు మంజీరా వాగులో వలలు వేసి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన కొడుకు విగత జీవిగా మారడంతో తల్లి యాదమ్మ తట్టుకోలేకపోయింది. స్పృహ తప్పిన యాదమ్మను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

సీఎంకు విలువలు ఇప్పుడు గుర్తొచ్చాయా?

హుస్నాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నీదాకా వస్తేగాని నొప్పి తెలియలేదా.. రాజకీయాల్లో విలువలు, భార్యా పిల్లలు సీఎం రేవంత్‌రెడ్డికి ఇప్పుడు గుర్తుకొచ్చాయా? అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డి భాష తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాక్షేత్రంలో ఉన్నవారిపై రాజకీయ విమర్శలు సబబే.. కానీ వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను సైతం ఈ రొంపిలోకి లాగి ఇష్టానుసారంగా దుష్ప్రచారానికి దిగింది రేవంత్‌రెడ్డి టీమేనని దుయ్యబట్టారు. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ అన్నట్లు సోషల్ మీడియాలో ఇలాంటి పోకడలను అరికట్టేందుకు అవసరమైతే చట్టాలను తీసుకురావాలన్నారు. చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేతపై ఈ విశృంఖలత్వం కొనసాగించడం విచారకరమన్నారు.

రోడ్లు సరే.. సూచిక బోర్డులు ఏవీ?

● కూడళ్ల వద్ద దారి తప్పుతున్న ప్రయాణికులు


వెంకటాపూర్- తిమ్మాయపల్లి మార్గంలో సూచిక బోర్డులేని ప్రధాన చౌరస్తా

నంగునూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలో రహదారుల నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, సూచికల బోర్డులు లేక ప్రయాణికులు గందరగోళానికి గురై దారితప్పే పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలంలోని పాలమాకుల నుంచి వెంకటాపురం మీదుగా తిమ్మాపల్లి, దుద్దెడ వెళ్లే రహదారిలో ప్రధాన చౌరస్తా వెంకటాపూర్, తిమ్మాపల్లి నర్మెట చౌరస్తాలో సూచికల బోర్డు లేకపోవడంతో ప్రయాణికులు దారితప్పుతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు దూర ప్రయాణం తగ్గించేందుకు చిన్నకోడూరు మండలం మల్లారం నుంచి నంగునూరు మండలం పాలమాకుల మీదుగా వెంకటాపూర్ తిమ్మాయపల్లి బందారం వరకు రింగు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. విస్తరణ పనులు సవ్యంగా జరిగినప్పటికీ, సూచికల బోర్డు లేకపోవడం ఇబ్బందిగా పరిణమించింది. నర్మెట మీదుగా కోనాయిపల్లి సిద్దిపేట వెళ్లే ప్రయాణికులు దారి తప్పి తిమ్మాయపల్లి, బందారం, దుద్దెడకు వెళ్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలి: గరీమా అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు వివిధ సెక్టార్లలో ఇచ్చిన లక్ష్యాలను మెరుగు పరుచుకునేలా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. మంగళవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో బ్యాంకర్లు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన త్రైమాసిక డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, ముద్రలోన్ సహా అన్ని రంగాల పథకాలు, కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో బ్యాంకర్లు, అధికారులు సమష్టిగా కృషి చేసి వందశాతం లక్ష్యాలను సాధించాలని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో టార్గెట్ త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో చివరగా నాబార్డు వారు జారీ చేసిన పొటెన్షియల్ లింకేజీ ప్లాన్ 2025-26 ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు అధికారి హరిబాబు, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, నాబార్డ్, డీడీఎం నిఖిల్, యూబీఐ వికాస్, అధికారులు, ఆయా బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట టౌన్: ఎల్ఆర్ఎస్ రుసుముపై 25 శాతం తగ్గింపు రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వార్డు అధికారులు, ఆర్పీలతో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల కోసం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

దుబ్బాక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. మంగళవారం దుబ్బాకలోని సాంఘికసంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. వంటగదిని, స్టోర్‌రూంను, భోజనశాలను పరిశీలించి, నాణ్యమైన బియ్యాన్ని అందించాలని డీఎస్‌వోను ఆదేశించారు. అంతకుముందు ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలో రాజకీయ నాయకులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె వెంట తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్‌శర్మ, ఎంఈవో ప్రభుదాస్, మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత తదితరులున్నారు.

అనాథలైన చిన్నారులకు చేయూత

తొగుట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో ఇటీవల ఆర్థిక సమస్యలతో కెమ్మసారం భాగ్య, నాగరాజు దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను మంగళవారం పలువురు పరామర్శించి అక్కున చేర్చుకున్నారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రాత్రి అనాథలైన పిల్లలను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావుతో కలిసి చిన్నారులను పరామర్శించారు. అనాథలైన చిన్నారులను దగ్గరికి తీసుకుని ఓదార్చారు. భవిష్యత్తులో వారు ఉన్నత చదువులకు అవసరమయ్యే ఖర్చులను తామే భరిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేశారు. అదేవిధంగా విన్నర్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ అరికపూడి రఘు చిన్నారులను దగ్గరకు తీసుకుని వారికి ధైర్యం చెప్పారు. వారి చదువుతో పాటు యోగ క్షేమాలను ట్రస్ట్ పరంగా అన్ని రకాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల విలువైన కిరాణ సామగ్రిని అందజేశారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల స్టడీ టూర్


జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ఫైనల్ ఇయర్ ఫిజిక్స్ విద్యార్థులు స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా మల్లన్న సాగర్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. హైడ్రో పవర్ ప్లాంట్ డీఈఈ చెన్ను శ్రీనివాసరావు విద్యార్థులకు జల విద్యుత్ తయారీ, టన్నెల్ నిర్మాణం, వాటర్ లిఫ్ట్ సిస్టమ్, మోటార్ హెచ్‌పీ సామర్థ్యం, శక్తి పరివర్తనం తదితర అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. విషదీకరించారు. సుమారు 57000 హార్స్‌పవర్ సామర్థ్యం గల మోటార్ల సహాయంతో నీటిని లిఫ్ట్ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ బి.కృష్ణయ్య, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట కళాశాలకు సైఫాబాద్ విద్యార్థులు

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉస్మానియా పరిధిలోని సైఫాబాద్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. విజ్ఞాన విహార యాత్ర నేపథ్యంలో వారు కళాశాలలోని జంతుశాస్త్ర విభాగంలో, మత్స్య శాస్త్ర విభాగంలో జరిగే పరిశోధనలను, ప్రయోగశాలలను వీక్షించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర మధ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పన్యాల అయోధ్య రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సైఫాబాద్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో పాటు కళాశాల బయోటెక్నాలజీ విభాగాధిపతి స్రవంతి, జాస్మిన్, జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రమేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మత్స్య శాస్త్ర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి: డీఈవో

గజ్వేల్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పదోతరగతి పరీక్షలలో ఎలాంటి ఒత్తిడి లేకుండా మంచి ఫలితాలను సాధించాలని విద్యార్థులకు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో లైన్స్‌క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, టీవైఆర్ ఫౌండేషన్ సహకారంతో నూతన ఇంగ్లిష్‌ల్యాబ్, లైబ్రరీని ప్రారంభించారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

విద్యార్థులపై కుటుంబసభ్యుల ప్రభావం

● మనో వికాస శాస్త్రవేత్త డాక్టర్ వీరేందర్

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని సభ్యుల ప్రభావం విద్యార్థులపై బలంగా ఉంటుందని ప్రముఖ మనోవికాస శాస్త్రవేత్త, విద్యా కౌన్సిలర్ డాక్టర్ సి. వీరేందర్ చెప్పారు. సిద్దిపేటలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను తయారుచేయడానికి కుటుంబం పునాది వంటిదన్నారు.పిల్లలకు సరైన భోజనము, బట్టలు అందించడం ముఖ్యం కాదని వారు ఎదుగుతున్న తీరును పరిశీలించాలని సూచించారు. ఇన్నోవేషన్ క్లబ్ ఏర్పాటు చేసుకొని అవరోధాలను అధిగమిస్తూ అద్భుత ఫలితాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ రిటైర్డ్ ఇంజనీర్, పాఠశాల పూర్వ విద్యార్థి కిషన్, సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్, సిద్దిపేట జిల్లా యోగా సెంటర్ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

గజ్వేల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎండిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు దేవి రవీందర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెండ మధు, మర్కుక్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డిలతో కలసి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు వరి పంట వేసి నీరు లేక నష్టపోయారని, ఎకరానికి రూ. 15వేలు నష్టపరిహారాన్ని అందించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

గజ్వేల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతులు దృష్టిసారించాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 105 గేదెలకు, 20 ఆవులకు చికిత్స అందించినట్లు పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్‌బాబు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాల ఏర్పాటు

మద్దూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ సెక్రటరీ మాధవ్‌జాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రేబర్తి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల ప్రదేశంలో తాగడానికి మంచినీళ్లతో పాటు మెడికల్ కిట్, ఓఆర్ఎస్ పాకెట్లు, ఆయింట్‌మెంట్, ప్యారాసిటమల్ ట్యాబ్లెట్లు, అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చిన్నకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో జయంత్ కుమార్, అల్లీపూర్ సొసైటీ సీఈవో బాల్‌రాజు, ఏఈవోలు శివ, జమీల్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

సింగన్నగూడ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం

మర్కుక్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం సింగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి ఉదయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. వార్షికోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్సులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బకాయిలను ఇవ్వలేమనడం సరికాదు : డీటీఎఫ్

మద్దూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఉద్యోగులకు రావల్సిన బకాయిలను ఇవ్వలేమని అనడం సమంజసం కాదని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రభాను తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి పడిన ఐదు డీఏలను 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని తప్పుబట్టారు. బకాయిలనువిడుదల చేయాలని కోరారు

అగ్రవర్ణ నిరుపేదలకు 'రాజీవ్ యువవికాస్' వర్తింపజేయాలి

సిద్దిపేట రూరల్,మార్చి 18(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాస్‌పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని నిరుపేద యువతకు అవకాశం కల్పించాలని రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు దొంగల బాపురెడ్డి కోరారు. మంగళవారం నారాయణరావుపేట మండలం కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది రెడ్డి సామాజిక వర్గంవారు అడ్డా కూలీలుగా పని చేస్తున్నారన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌దే


సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాట మేరకు బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశ పెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పూజల హరికృష్ణ, అత్తుఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంప మహేందర్, బొమ్మల యాదగిరి, సాకి ఆనంద్, ఆలకుంట మహేందర్, పయ్యావుల ఎల్లం, ముద్దం లక్ష్మి, మార్క సతీష్‌గౌడ్, పూజల గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాలపై రాజకీయం వద్దు

పవిత్ర రంజాన్ మాసంలో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న రంజాన్ తోఫాలపై తంజీం నాయకులు రాజకీయం చేయవద్దని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలు పండుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లిం కమ్యూనిటీకి చెందిన పెద్దలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు రంజాన్ కిట్లను అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ఆర్ఆర్, మస్కటి డైరీ సంస్థకు చెందిన నిర్వాహకులు రంజాన్ తోఫాలను తంజీమ్‌కు అప్పగించగా, వారు వాటిని పంపిణీ చేయకుండా పక్కన పెట్టారని మండిపడ్డారు.

బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకం

గజ్వేల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదింప చేయడం చారిత్రాత్మక నిర్ణయమని, రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభోత్సవానికి కృతజ్ఞతగా గజ్వేల్ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించాయి. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్‌తో కలసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యువతను రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా వివిధ రకాల ప్రోత్సాహకాలతో ఆర్థికంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు.

●మిరుదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమని దుబ్బాకబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ అన్నారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మిఠాయిలను పంచుకున్నారు.

పంట పొలాలకు వెళ్లే దారికి మరమ్మతులు చేయండి


వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో నిరసన తెలుపుతున్న రైతులు

జగదేవ్‌పూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లే రహదారి సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, మరమ్మతులు చేయించాలంటూ మండలంలోని తిగుల్ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం సుమారు వంద మంది రైతులు పంట పొలాలకు వెళ్లే దారి(బాట)ని చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిగుల్ నుంచి గజ్వేల్ మండలం హవాయిగూడ మీదుగా దాతర్‌పల్లి వరకు సుమారు 200 మంది వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. వెయ్యి ఎకరాలకు పైగా సాగు భూమి ఉందని అక్కడ పంట పొలాలకు వెళ్లేందుకు నక్షబాట ఉందన్నారు. కాగా బండ్లబాట సరిగా లేకపోవడం వల్ల ప్రతీ వర్షాకాలంలో పంట సాగుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలో ఎరువులు తీసుకెళ్లాలన్నా నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. రోడ్డు అంతా గుంతలు పడి నడవలేని స్థితిలో ఉందని తమ గోడును వెళ్లబుచ్చారు. పంట చేతికొచ్చే సమయంలో కూలీలు ఆ వైపు రావాలంటే రావడంలేదని దీంతో చుట్టూ పది కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కనీసం ఉపాధిహామీ పథకం కింద బాటను బాగు చేయాలని కోరారు. మట్టి రోడ్డును బిటి రోడ్డుగా చేయాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో పాటు అన్ని శాఖల అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని వివరించారు.

కోర్టుకెళ్లాల్సి రావడం బాధాకరం- తపస్

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం, పీఆర్సీ కోసం, రిటైర్మెంట్ బెనిఫిట్‌ల కోసం కోర్టుకెళ్లాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు విచారం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన తపస్ సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ.. కేవలం ఈ రాష్ట్రంలో తప్ప దేశంలోని ఏ రాష్ట్రంలోనూ 5డీఏలు పెండింగ్‌లో లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ 6 నెలలకోసారి డీఏ విడుదల చేస్తుంది. కానీ మన దగ్గర 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని జూలై వస్తే ఉద్యోగులకు ఆరో డీఏ బాకీపడ్డట్టే అని అన్నారు. ఇక పీఆర్సీ గురించి ఊసేలేదు అన్నారు. దీంతో డీఏలు, మెరుగైన ఫిట్‌మెంట్ కోసం ఉద్యోగులు పోరాటానికి సిద్ధపడుతున్నారన్నారు ఇప్పటికే రూ. 8 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీపీఎస్ ఉద్యోగుల వాటా రూ. 2వేల కోట్లు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. దీంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారన్నారు. సమావేశంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి దుబాష్ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్ రెడ్డి, తపస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుమల మురళీధర్, చంద్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక, మార్చి 18: సిద్దిపేట జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతులలోని బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా డీసీవో శివప్రసాద్ తెలిపారు. ఆసక్తి కలవారు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సంవత్సర ఆదాయం రూ. లక్షన్నర, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్ లైన్ లో చేసుకోవాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 22 మందికి జరిమానా

● ఒకరికి మూడు రోజుల జైలు

సిద్దిపేట క్రైం/గజ్వేల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లోకి వివిధ ప్రాంతాల్లో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 22 మంది పట్టుబడ్డారు. నిందితులను పోలీసులు మంగళవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా న్యాయాధికారులు వారికి జరిమానా విధించారు. అందులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేటలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం ఐదుగురికి రూ.6,500 జరిమానా విధించారు. వారిలో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 17 మంది వాహనదారులు పట్టుబడినట్టు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి వెల్లడించారు. నిందితులను మంగళవారం కోర్టులో గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పరచగా వారికి రూ.13వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని ఆయన వివరించారు.

బావిలో పడి రైతుకు గాయాలు

చేర్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బావిలోని మోటారును వెలికి తీసే యత్నంలో ప్రమాదవశాత్తు రైతు బావిలోపడి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాల గ్రామానికి చెందిన చిగురు రాజయ్య రెండు ఎకరాల వ్యవసాయభూమిలో వరిసాగుచేశాడు. చాన్నాళ్లుగా పొలంలోని బావి ఎండిపోవడంతో మోటర్ నిరుపయోగంగా మారింది. దీంతో ఈ మోటర్‌ను మరోచోట కౌలు చేస్తున్న పొలంలో బిగించడానికి సంకల్పించాడు. ఈ క్రమంలో తమ పొలంలోని బావిలో వృథాగా ఉన్న మోటార్‌ను వెలికి తీస్తుండగా ప్రమాదవశాత్తు తాడు తెగి బావిలో పడిపోవడంతో రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల రైతులు గమనించి రాజయ్యను చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం సిద్దిపేటలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు.

రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్ వద్ద చెలరేగిన మంటలు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద గల ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వడంతో, వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సుమారు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. గడ్డిపొదలు, పిచ్చి మొక్కలు కాలిపోగా మంటలు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది నిరోధించగలిగారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఇంట్లో సామగ్రి దగ్ధం

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పెట్టిన దీపం పెట్టి బయటకు వెళ్లి వచ్చేసరికి నిప్పంటుకుని మంటలు చెలరేగి వస్తు సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం కొమురవెల్లి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి గ్రామానికి చెందిన మాంకాల అనిల్ మల్లన్న ఆలయ పరిధిలోని కోనేరు సమీపంలో చిరుదుకాణం ఏర్పాటుచేసుకుని నడుపుకుంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎప్పటిలాగే దీపం పెట్టి షాపుకు వెళ్లిపోయాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించి పొగ కమ్ముకోవడాన్ని గమనించిన చుట్టుపక్కలవారు అనిల్‌కు సమాచారం అందించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని వస్తు, సామగ్రి, దుస్తులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1లక్షమేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఇంటర్ పరీక్షల్లో ఐదుగురు డిబార్

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతుండగా, మంగళవారం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని డీఐఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఇంటర్మీడియట్ బోర్డు పరిశీలకులు సందర్శించారన్నారు. ఆ కేంద్రంలో కాపీ కొడుతున్న ఐదుగురు విద్యార్థులను బోర్డు పరిశీలకులు మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారని చెప్పారు. కాగా జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల కమిటీ బృందం, హైపవర్ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాయని డీఐఈవో వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 12మంది విద్యార్థులు డిబార్ అయినట్లు తెలిపారు.

పీఎంశ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీలను రద్దు చేయాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సిద్దిపేట అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకంతో పాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అడ్డుకోవాలన్నారు. పీఎంశ్రీ పథకం వల్ల ఐసీడీఎస్ నిర్వీర్యం అవుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని అన్నారు. ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కంద బోయిన ఎల్లయ్య, జిల్లా కోశాధికారి జి.భాస్కర్, సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు బాలయ్య, కొమురయ్య, యూనియన్ నాయకులు, టీచర్స్ ఆయాలు పాల్గొన్నారు.

భారతీయ మజ్దూర్ సంఘ ఆధ్వర్యంలో ధర్నా

సిద్దిపేట అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ -95 ఒక కనీస పెన్షన్‌ను రూ. వెయ్యి నుంచి 5వేలకు పెంచాలని, కార్మిక రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈపీఎఫ్ జీత పరిమితిని 15 వేల నుంచి 30 వేలకు పెంచాలని పలు డిమాండ్లు చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

చెల్కలపల్లి గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

చిన్నకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్కలపల్లి గ్రామాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్, అదనపు టీఎంసీ పైపు లైన్ కాలువ పనులతో ఇబ్బందులు పడుతున్నామని, తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని గ్రామస్థులు విన్నవించారు.

మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్‌కు ఘన నివాళి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇందుర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు 6వ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డు చౌరస్తాలో బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పూలమాలలు వేసి నివాళులర్పించారు.